క్లుప్తంగా

చింతలపూడి కమిషనర్‌గా రాంబాబు


ఎ.రాంబాబు

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్‌గా అంబటి రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జగ్గయ్యపేట మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ ఇక్కడికి వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన డి.పావని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ రాంబాబు మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

గిన్నిస్ బుక్ హోల్డర్‌కు సన్మానం


ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం: గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన జీవన్ ప్రసాద్‌ను మండలంలోని యర్రంపేటలో శుక్రవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. హాలెల్ అండ్ అంతర్జాతీయ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కీబోర్డు ప్రదర్శనలో ప్రసాద్ ఇటీవల తన ప్రతిభతో గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించడం గ్రామానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో భోగల్ల తులసి కృష్ణ, విగ్గిన రామ కృష్ణ, చింతలపూడి కిషోర్, వుస్సే బాబురావు, రాఘవరాజు సాయి కృష్ణ, చల్లారి బ్రహ్మయ్య, దండే యశ్వంత్, చవల నాగేశ్వరావు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన దత్తాత్రేయ స్వామి విగ్రహం

కొయ్యలగూడెం: మండలంలోని అంకాలగూడెంలో శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 7.52 గంటలకు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. యంత్ర బింబ ప్రతిష్ఠ, కుంభాభిషేకం చేశారు. అర్చకులు తొలుత గణపతి పూజ చేసి, గత మూడు రోజుల పాటు నిర్వహించిన హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం నుంచి మూడు వేల మందికిపైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


దాత సత్యనారాయణకు విరాళం బాండ్ పత్రం అందిస్తున్న దుర్గాప్రసాద్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా దూబచర్లకు చెందిన నార్ని సత్యనారాయణ శుక్రవారం రూ.1,00,100 విరాళంగా అందజేశారు. ఆయన తొలుత స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ముస్లిం కమిటీ హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న ముస్లిం కమిటీ సభ్యులు

కామవరపుకోట: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముస్లిం వివాదాస్పద సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ స్థానిక కొత్తూరు జామియా మస్జిద్ ముస్లిం కమిటీ సభ్యులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. అందుకు సహకరించి, మద్దతుగా నిలిచిన వైఎస్సార్ సీపీ నాయకత్వానికి, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లాల్ జాన్ బాషా, షేక్ ఇబ్రహీం, నూర్జాన్, బాబుజాన్, యూసఫ్, అన్వర్, ముస్లింలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్వర్టు

లింగపాలెం : కొణిజర్ల నుంచి ధర్మాజీగూడెం వచ్చే ప్రధాన రహదారిలో ఏటికాలువ తూరల కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఇది ఇటు ధర్మాజీగూడెం, అటు కొణిజర్ల మరోవైపు మఠంగూడెం వెళ్లే మూడు రోడ్ల కూడలిలో ఉంది. ఈ కల్వర్టుపై నుంచి నిత్యం ఈ మూడు గ్రామాలకు చెందిన రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు అనేక సార్లు ఈ కాలువలోకి బోల్తాపడి ప్రమాదానికి గురయ్యాయి. ఇరిగేషన్ అధికారులు వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

దిగుబడులు, ధర లేక దిగాలు

- మిర్చి రైతుల ఆవేదన
- పట్టించుకోని పాలకులు


లింగపాలెం మండలంలోని పొలాల్లో ఆరబెట్టిన ఎండిమిర్చి

లింగపాలెం : మిర్చి పంటకు మెట్టప్రాంతమైన లింగపాలెం మండలం జిల్లాలోనే ప్రసిద్ధిచెందింది. మండలంలో సుమారు 400 ఎకరాల్లో రైతులు మిర్చి సాగుచేశారు. మిర్చితోటలకు నల్లి, వైరస్ తెగుళ్లు వ్యాపించటంతో పంట దిగుబడులు తగ్గాయి. మరోవైపు గిట్టుబాటు ధరలేక పోవటంతో రైతులు కలవర పడుతున్నారు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు.

రూ.3 లక్షల వరకు పెట్టుబడి

ఎకరం తోటలో మిర్చి సాగుకు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. 14 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. వీటిలో ఒక క్వింటాకు పైగా తాలుకాయలు ఉండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. వాస్తవానికిఇ ఎకరాకు 25 క్వింటాళ్ల నుంచి 28 క్వింటాళ్ల వరకు ఎండి మిర్చి దిగుబడులు రావల్సి ఉంది. ఎకరం కౌలుకు రూ.30 వేలు చొప్పున చేలు కౌలుకు తీసుకుని రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మిర్చి నాణ్యతను బట్టి క్వింటాకు రూ.12 వేలు నుంచి రూ.13 వేలు వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇదే ధర కొనసాగుతుందనే నమ్మకం లేదని రైతులు చెబుతున్నారు.

గతేడాది క్వింటా రూ.21 వేలు నుంచి రూ.23 వేలు వరకు ధర ఉండగా, నేడు రూ.11 వేలకు పైగా ధర పడిపోయింది. మిర్చి క్వింటాకు కనీసం రూ.22 వేలు ధరపలికితేగాని గిట్టుబాటుకాదని రైతులు చెబుతున్నారు. ధర లేకపోవటంతో మిర్చి పంటను విజయవాడ, గుంటూరు యార్డులకు లారీలపై తరలిస్తున్నారు. గిట్టుబడి ధర వచ్చేంత వరకు పంట నిల్వ చేసేందుకు ఈ ప్రాంతంలో శీతల గిడ్డంగి నిర్మించాలని, గిట్టుబాటు ధర కల్పించాలని మిర్చి రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



మిర్చి సాగుకు పెట్టుబడులు పెరిగాయి. ఎకరాకు సుమారు రూ.3 లక్షల వరకు పెట్టుబడులు పెడుతున్నాం. ప్రభుత్వం ఎండిమిర్చికి మద్దతు ధరను కల్పించాలి. ప్రస్తుత ధరను బట్టి కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. మార్కెట్ పరిస్థితి ఇలాగే ఉంటే మిర్చి సాగు కనుమరుగవక తప్పదు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, మిర్చి రైతులను ఆదుకోవాలి.

– చలమాల మారేశ్వరరావు, రైతు, కొణిజర్ల

రేపటి నుంచి శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాలు


లక్ష్మీపురం శ్రీనివాసుడు


స్వామివారి కల్యాణ మండపం


శిల్పకళలతో ఉట్టిపడుతున్న పురాతన ఆలయం

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈనెల 26 వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న స్వామివారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేసి, ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 21న స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు సర్వాది దేవతలను, రుషులను ఆహ్వానించే క్రమంలో అర్చకులు, పండితులు ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 22న ఎదుర్కోలు ఉత్సవం, 23న రాత్రి 8 గంటలకు ఉభయ దేవేరులతో స్వామివారి తిరు కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. 24న సమీప గ్రామమైన తిమ్మాపురంలో స్వామివారికి గరుడోత్సవాన్ని, 25న శ్రీ చక్రవార్యూత్సవం, ఉత్సవాలను వీక్షించిన సర్వాది దేవతలకు, రుషులకు వీడ్కోలు ఇచ్చే క్రమంలో ధ్వజావరోహణ నిర్వహిస్తారు. 26న రాత్రి 7 గంటల నుంచి నిర్వహించే ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

ఆలయ విశిష్టత ఇదీ

ఒకే ఆలయగోపుర గర్భ భాగంలో శ్రీ వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లతో పాటుగా జగన్నాథస్వామి, బలరామ, సుభద్రదేవుల సన్నిధి, ఆళ్వారుల సన్నిధి, సంతాన వేణుగోపాల స్వామి సన్నిధి ఉండటం ఈ ఆలయ ప్రత్యేకత. శ్రీవారి క్షేత్రానికి సుమారు 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న లక్ష్మీపురంలో ఈ ఆలయాన్ని శతాబ్దంన్నర క్రితం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన పూరీ మఠాధిపతులు మంత్రరత్నం అమ్మాజీ తన ఇలవేల్పు శ్రీనివాసుని ఆలయాన్ని ఇక్కడ నిర్మించారు. ఆమె పూరీ జగన్నాథ మఠాధిపతులు కావడంతో జగన్నాథ స్వామిని కూడా ఇక్కడ ప్రతిష్ఠించారు. అనంతరం ఉత్సవాలు నిర్వహించి కైంకర్యం చేయగా కాలక్రమేణా ఆలయం శిథిలమైంది. దీంతో 1992లో ఈ ఆలయాన్ని ద్వారకాతిరుమల దేవస్థానం దత్తత తీసుకుని జీర్ణోద్ధరణ చేసి, అభివృద్ధి చేసింది. ప్రతి ఏటా దేవస్థానం అధికారులు ఈ ఉత్సవాలను ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్నారు.

నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరం


రికార్డులను పరిశీలిస్తున్న ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ

కామవరపుకోట: నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం పోలీసు వ్యవస్థకు ఎంతో అవసరమని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ అనానరు. శుక్రవారం స్థానిక తడికలపూడి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ప్రతాప్ కిషోర్‌తో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వాహనాలు తనిఖీలు నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై, గంజాయి ముఠాల బెడద లేకుండా చర్య తీసుకోవాలని స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు.

నూకాలమ్మ ఆలయంలో పూజలు


నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, మూలవిరాట్‌కు ఏకాదశ హారతి, వేదదర్బారుసేవ తదితర పూజలు అర్చకులు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ స్థానిక దూడే కనకదుర్గ సత్యనారాయణ (డీకేడీ), భాగ్యలక్ష్మి దంపతులు నూకాలమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఆలయ అభివృద్ధికి రూ.25,116లు విరాళంగా అందజేశారని తెలిపారు. దాత దంపతలును ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించామన్నారు. పట్టణ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ తాలూకా యూనిట్ కార్యవర్గం ఎన్నిక


ఏపీజీఈఏ నూతన కార్యవర్గం

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జంగారెడ్డిగూడెం తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ ఎన్నికల్లో తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా మలేరియా సబ్ యూనిట్ అధికారి వెలివెల పెద్దిరాజు, కార్యదర్శిగా పి.ఫణీంద్రబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్‌బాజీ షహీద్ బాబా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెన్నా భానుప్రకాష్, ట్రెజరర్‌గా ఎం సువర్ణ, సంయుక్త కార్యదర్శులుగా అనిపూడి వెంకటేశ్వరరావు, ఎస్వీ సుబ్బారావు, పి.చినబాబు, కె.సాంబశివరావు, టి.గురవమ్మ, ఉపాధ్యక్షులుగా కొప్పుల సత్యనారాయణ, కె.మధుసూధనరావు, కె.రాజ్యలక్ష్మి, టి.మణిదివ్య, కె.వసంతరావులు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి ఎస్ఎస్వీ రామకృష్ణరావు ఎన్నికల అధికారిగా, ఉపాధ్యక్షుడు ఎం కిరణ్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

దుర్గమ్మ ఆలయంలో చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మవారి ఆలయంలో 29వ చండీహోమాన్ని శుక్రవారం ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, కార్యదర్శి మాడారామ్మోహనరావు పర్యవేక్షణలో ప్రధానార్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు, వేదపండితులు సత్యకిరణ్ ఘనంగా నిర్వహించారు. చండీహోమానికి ఉభయదారులుగా కొంకిమళ్ల గంగాధరరావు, శ్రీదేవి దంపతులు, సోము హరినారాయణ, విజయలక్ష్మి దంపతులు, పాశం దివ్యశ్రీ, కొప్పుల వెంకట సీతామహాలక్ష్మి వ్యవహరించారు. ఆధ్యాత్మికవేత్త కేఎల్ఎన్ ధనకుమార్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

22న జంగారెడ్డిగూడెంలో శాంతి ర్యాలీ సభ


లెనిన్ జయంతి కరపత్రం విడుదల చేసిన నాయకులు

జంగారెడ్డిగూడెం: కేంద్రం మధ్యభారత అడవుల్లో ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసులపై దాడులు చేస్తూ మారణహోమాన్ని సృష్టిస్తోందని, లెనిన్ జయంతి సందర్భంగా కగార్ దాడికి వ్యతిరేకంగా ఈనెల 22న ఉదయం 10 గంటలకు జంగారెడ్డిగూడెంలో నిర్వహించే శాంతి ర్యాలీ, సభను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. తొలి సోషలిస్ట్ రాజ్య నిర్మాత, మార్కిస్ట్ మహోపాధ్యాయుడు వీఐ లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకుని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో లెనిన్ జయంతి కరపత్రాన్ని ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ విడుదల చేశారు. జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి బాబురావు బత్తుల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అటవి హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ప్రశ్నిస్తున్న మేధావులపై, అభ్యుదయ వాదులపై ప్రజా కళాకారులపై అర్బన్ నక్సలైట్ల పేరుతో ఉపా చట్టాన్ని ఉపయోగించి నిర్బంధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్టీయూ, పీడీఎస్‌యూ (వి) పీవోడబ్ల్యూ (స్త్రీ విముక్తి) తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో నిర్వహించే శాంతి ర్యాలీ, సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం ఏపీఆర్‌సీఎస్ నూజివీడు డివిజన్ కార్యదర్శి కొండా రాము, నాయకులు నాగేశ్వరరావు, కాటయ్య, కనకయ్య, దుర్గారావు, గోపి, కుర్రాజులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు

జంగారెడ్డిగూడెం: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పదో రోజు స్థానిక నాలుగో వార్డు ఇందిరా నగర్ కాలనీ ఎంపీపీ స్కూల్ ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో కమ్యూనిటీ మేనేజ్మెంట్ ఎక్యూట్ మాల్ న్యూట్రిషన్, హెచ్‌బి టెస్ట్‌లపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా నాలుగో వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ హాజరై పిల్లల్లో పోషకాహార లోపం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇంటికిచ్చే టేక్ హోమ్ రేషన్, బాల సంజీవిని కిట్టు, ఐదు రకాల ఫుడ్ ఐటమ్స్, నూనె, పాలు గుడ్లు సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. సీడీపీఓ పి.బ్యూల మాట్లాడుతూ బరువు తక్కువ, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు ఇచ్చే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ స్కూల్ మాస్టారు నాగబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, టీచర్లు బేబీరత్నం, శిరోమణి, పుష్పలత, ఐఆర్‌సీ టీచర్ రజనీ, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ చిన్నారులు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు


కొయ్యలగూడెం : గవరవరంలో శిలువ యాత్ర


బుట్టాయగూడెం : గవరంపేట కొండపైకి శిలువ యాత్ర


జంగారెడ్డిగూడెం : శిలువ యాత్ర నిర్వహిస్తున్న విశ్వాసులు


కామవరపుకోట : శిలువ యాత్ర నిర్వహిస్తున్న విశ్వాసులు


ద్వారకాతిరుమల : గొల్లగూడెంలో శిలువ యాత్ర


చింతలపూడి : క్రైస్తవులకు స్వాగతం పలుకుతున్న ముస్లింలు

కొయ్యలగూడెం: గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ చర్చల్లో విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మండలంలోని గవరవరం, కొయ్యలగూడెం గ్రామాల మధ్య భారీ శిలువ యాత్ర నిర్వహించారు. ప్రేమ, కరుణ, శాంతికి ప్రతి రూపం ప్రభువైన యేసుక్రీస్తు అని గవరవరం ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు ఆనంద్ భాస్కర్ తెలిపారు. అంకాలగూడెం నుంచి శిలువ మార్గం నిర్వహించారు. సహాయక గురువులు అరుణ్, ఉపదేశకులు అనిల్, సింగ్, జేసుదాసు, ఏసోబు, విశ్వాసులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

టి.నరసాపురం: శాంతియుత సమాజానికి క్రీస్తు బోధనలు అనుసరణీయమని పాస్టర్‌లు ప్రబోధించారు. మండలంలోని ప్రకాష్ నగర్, పుట్రేపు, రుద్రకోటరాజుగూడెం, గండిగూడెం, మక్కిగూడెం, టి.నరసాపురం, బొర్రంపాలెం, తెడ్లం తదితర గ్రామాల్లో శిలువమార్గం నిర్వహించారు. కార్యక్రమాల్లో పాస్టర్లు జి.జ్ఞాన్‌రాజు, కె.నిరీక్షణరావు, సీహెచ్ హోషేయలు మాట్లాడుతూ యేసుక్రీస్తు త్యాగం విలువైందని, ప్రపంచ శాంతియుత సమాజానికి దోహదపడుతుందని అన్నారు. పాస్టర్లు కె.పాల్‌చిన్నారావు, సీహెచ్ రమేష్, టి.ప్రసన్నకుమార్, అకుల, ప్రసన్నరాజు, జాన్ మీకా, తీతు పలువురు పాల్గొన్నారు.

మన్యం గ్రామాల్లో శిలువ యాత్ర

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం, సెయింట్ మార్క్స్, లూథరన్ చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చి, సంఘస్తుల ఆధ్వర్యంలో శిలువయాత్ర నిర్వహించారు. గవరంపేటలో పరిశుద్ధాత్మ చర్చి సంఘస్థుల ఆధ్వర్యంలో సిల్వరి గిరి విజ్ఞాప గోపురం కొండ వరకు శిలువ యాత్ర నిర్వహించారు. పాస్టర్ బాలరాజు, సంఘ పెద్దలు కోర్సా గంగరాజు, రమణ,శ్రీను, జయరాజు పాల్గొన్నారు.

వాడవాడలా శిలువ యాత్ర

ప్రత్యేక ప్రార్థనలు

పోలవరం రూరల్: స్థానిక బైబిల్ మిషన్ సింధూర మందిరంలో పాస్టర్ ఎలిపే గమానియేలు క్రీస్తు శిలువ వేయబడిన విధానాన్ని వివరించారు. బైబిల్ మిషన్ సెక్రటరీ పీజే సుధాకర్ చర్చిలో ప్రార్థనలు చేశారు. దైవ సేవకురాలు ఎలిపే పరంజ్యోతి, అనూష షైనీ ఆరోన్, ఎస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిలువ మార్గం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు ఫాదర్ కె.కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో శిలువ మార్గం నిర్వహించారు. కథొలిక విశ్వాసులు పాల్గొన్నారు. రెవరెండ్ ఫాదర్ బాలస్వామి గుడ్ ఫ్రైడే వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో నిర్మలా కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ అమలారాణి, కన్య స్త్రీలు, ఉపదేశులు, సంఘ పెద్దలు, కతోలిక విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కామవరపుకోటలో..

కామవరపుకోట: స్థానిక కొత్తూరు రోమన్ క్యాథలిక్ మిషన్ ఆధ్వర్యంలో విశ్వాసులు పాతూరులో శిలువ యాత్ర నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాదర్ గోగు పీటర్ ప్రసాద్ మాట్లాడుతూ సర్వ మానవాళి పాప పరిహారార్థం ఏసుక్రీస్తు శిలువలో మరణించారని వివరించారు. కర్మెల్ చర్చి పాస్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు రక్తం ప్రతి పాపం నుంచి కడిగి ప్రజలను పరిశుద్ధులుగా చేసిందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

ద్వారకాతిరుమల: మండలంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలను విశ్వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాళ్లకుంట విచారణలో రెవరెండ్ ఫాదర్ ఇ.జీవరత్నం ఆధ్వర్యంలో శిలువ మార్గం నిర్వహించారు. 1300 మంది విశ్వాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు శిలువ మరణం, శిలువ యాగం, గాయం ద్వారా మానవాత్మకు, మనస్సుకు, శరీరానికి స్వస్థత కలుగుతుందని ఫాదర్ జీవరత్నం వివరించారు. జి.కొత్తపల్లి సీఎస్ఐ చర్చిలో, గొల్లగూడెంలో శిలువ మార్గం నిర్వహించారు.

మతసామరస్యాన్ని చాటిన ముస్లింలు

చింతలపూడి : మండుటెండలో శిలువ యాత్ర నిర్వహిస్తున్న విశ్వాసులకు లస్సీలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి మత సామరస్యాన్ని చాటుకున్నారు ముస్లింలు. చింతలపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న 2 వేల మంది క్రైస్తవులకు స్థానిక జామియ మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఎస్‌డీ బాబు, కార్యదర్శి ఎండీ జిలాని, జమాతె ఇస్లామి హింద్ పట్టణ అధక్షుడు ఎండీ అక్బర్ అలీ, ఎస్‌కే ఆజాద్‌బాబు, ముస్లిం యూత్ నేతృత్వంలో సీఐ రాజశేఖర్ చేతుల మీదుగా లస్సీలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. చింతలపూడి కోర్టు నుంచి బోయగూడెం ఆర్‌సీఎం చర్చి వరకు నిర్దేసిత 14 ప్రదేశాల్లో రోడ్డుపై విశ్వాసులు మోకరిల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రోమన్ కేథలిక్ మిషన్ రెవరెండ్ ఫాదర్ కామా మాధ్యూ శిలువ యాత్రను ప్రారంభించారు. అల్లిపల్లి, యర్రగుంటపల్లి, రాఘవాపురం, ఆంథోనీ నగర్, ఫాతిమాపురం గ్రామాల్లోనూ క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం

లింగపాలెం : మండలంలోని బుల్లావారిగూడెం, ధర్మాజీగూడెం ఆర్‌సీఎం చర్చిల నుంచి భోగోలు గట్టుపై ఉన్న ఏసు క్రీస్తు శిలువ వరకు విశ్వాసులు శిలువ యాత్ర నిర్వహించారు. ధర్మాజీగూడెంలో ముస్లింలు విశ్వాసులకు డ్రింక్స్, మజ్జిగ ప్యాకిట్లు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో క్రీస్తు మాలాధారులు పాల్గొన్నారు.